# నల్లధనం వెలికితీత వీలౌతుందా?

**ఇటీవల కాలంలో అవినీతి, నల్లధనం అంశాల మీద విస్తృత చర్చలు జరుగుతున్నాయి. ఒక వైపు పౌర సమాజం, మరో వైపు పార్లమెంటరీ వ్యవస్థలు నల్లధనం అంశం మీద తీవ్ర ఆందోళన వెలిబుచ్చాయి. నల్లధనం సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవహారాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. పాలనా వైఫల్యం, అవినీతి.. సమాజంలో అట్టడుగు వర్గాలను మరింత ఇబ్బంది పెడుతున్నాయి. ప్రగతి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందాలంటే అవినీతి, నల్లధనాన్ని పూర్తిగా నిర్మూలించాలి.**

నల్లధనం అంటే అక్రమంగా ధనాన్ని పొంది ఉండటం. ఇది రెండు విధాలుగా సంభవిస్తుంది. మొదటిది నేరాలు, మాదక ద్రవ్యాల వ్యాపారం, ఉగ్రవాదం, అవినీతి కార్యకలాపాల ద్వారా సంపాదించిన ధనం. రెండోది న్యాయబద్ధంగా డబ్బు సంపాదించినప్పటికీ పన్నులు ఎగవేయడం ద్వారా అదనపు ధనాన్ని కలిగి ఉండటం. ఇందులో మొదటి రకం నల్లధనం చాలా ప్రమాదకరమైంది. ప్రభుత్వం దీనిని అరికట్టడంలో తీవ్ర కృషి చేయాల్సి ఉంటుంది. లేకపోతే అది దేశ మనుగడకే పెద్ద సవాలుగా మారుతుంది. రెండో తరహా నల్లధనాన్ని వెలికితీయడానికి ప్రస్తుతం అమలులోనున్న చట్టాలను, ప్రభుత్వ విధానాలను పూర్తిగా ప్రక్షాళనం గావించడంతోపాటు పాలనా వ్యవస్థను మరింత పటిష్టవంతం గావించాలి. దురదృష్టవశాత్తూ నల్లధనం విషయంలో పన్ను చెల్లింపుదారునికి, పన్నులు వసూలు చేసే ప్రభుత్వ యంత్రాంగానికి విభిన్న దృక్పథాలున్నాయి. సరైన నియంత్రణ, పన్ను వసూలు ప్రక్రియ ద్వారా మార్కెట్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, అదేవిధంగా ప్రజా శ్రేయస్సుకు పాటుపడటానికి ప్రభుత్వానికి తగిన వనరులు లభింపజేయడం, నిజాయితీగా పన్నులు చెల్లించడానికి ప్రజలను ప్రోత్సహించడం అనే మూడు లక్ష్యాలను సాధించొచ్చు. అయితే ఇది ఆచరణలో అంత సులభం కాదు. పన్ను ఎగవేతను, నల్లధన ఉత్పత్తిని నివారించాలంటే ప్రభావవంతమైన పాలనా వ్యవస్థ, సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించడం వంటి సాధనాలు కావాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు, విదేశాల సహకారం కూడా అవసరం.

SAKSHI

## నల్లధనం ఉత్పాదకతకు దారితీసే పరిస్థితులు:

నేరపూరిత కార్యకలాపాలు నల్లధనం ఉత్పత్తికి దోహదం చేస్తాయి. ప్రధానంగా మాదక ద్రవ్యాల ఉత్పత్తి, వ్యాపారం, దొంగనోట్ల చలామణి, అక్రమ గనుల త్రవ్వకం, అక్రమ మత్తు పానీయాల ఉత్పత్తి-అమ్మకం, దొంగతనం, అక్రమంగా మనుషుల రవాణా, వ్యభిచార వ్యాపారం, బ్యాంకులను మోసం చేయడం, నకిలీ వస్తువుల తయారీ-అమ్మకం, అక్రమ ఆయుధాల రవాణా మొదలైనవి. ఈ రకమైన నేరాలను ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ చట్టం (2002)లో పేర్కొన్నారు.

అవినీతి కార్యకలాపాలు కూడా నల్లధనం ఉత్పత్తికి దోహదం చేస్తాయి. ప్రధానంగా లంచాలు తీసుకోవడం, ప్రభుత్వ, ప్రజా ఆస్తులను దొంగిలించడం లాంటి కార్యకలాపాలను ప్రభుత్వ పదవులలో ఉన్నవారు (మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వోద్యోగులు) కొనసాగిస్తున్నారు. వ్యాపార అనుమ

తులివ్వడం, సామాజిక కార్యక్రమాలకు కేటాయించిన ధనాన్ని దారి మళ్లించడం, చీకటి బజారులో నిత్యావసర వస్తువులను అధిక ధరలకు అమ్మడం, ప్రజావసరాలకు కేటాయించిన భూమిని వ్యాపార కార్యకలాపాలకు మళ్లించడం, అక్రమ భవన నిర్మాణాల అనుమతికి లంచాలు తీసుకోవడం మొదలైనవి ఈ కోవకు చెందుతాయి. ఇవన్నీ మానవుని పేరాశకు, క్షీణిస్తున్న సామాజిక విలువలకు, వాటిని నిరోధించలేని ప్రభుత్వ అసమర్థతకు దర్పణాలు.

ఏ మేరకు నల్లధనం భారతదేశంలో, విదేశాలలో భారతీయుల ద్వారా చలామణి అవుతున్నదన్న విషయంలో స్పష్టత లేదు. కొందరి అంచనాల ప్రకారం స్విస్ బ్యాంకులలో దాచిపెట్టిన మొత్తం 1.4 ట్రిలియన్‌ల అమెరికన్ డాలర్లయితే, స్విస్ బ్యాంకుల అసోసియేషన్ అంచనా ప్రకారం అది కేవలం 2 బిలియన్ల అమెరికన్ డాలర్లు మాత్రమే. సీబీఐ డైరెక్టర్ అంచనాల ప్రకారం అది 5 బిలియన్ల అమెరికన్ డాలర్లు. ఇకపోతే మనదేశంలో నల్లధనం ఎంత చెలామణి అవుతుందో స్పష్టత లేదు. మొత్తం మీద నల్లధనం సమాంతర ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేసిందనే విషయం వాస్తవం.

## నల్లధనం ఉత్పాదనకు అనుసరించే పద్ధతులేమిటి?

- **ఆర్థికలావాదేవీల (ఖాతాల) నిర్వహణలో అవకతవకలు:** తమకు వచ్చే ఆదాయాన్ని పూర్తిగా చూపించకపోవడం. తద్వారా పన్నుల ఎగవేత.
- **సమాంతర ఖాతాల నిర్వహణ:** ఆదాయపు పన్ను విభాగానికి సమర్పించడానికి తక్కువ ఆదాయాన్ని, ఎక్కువ ఖర్చును చూపిస్తూ ఖాతాలు నిర్వహించడం. తమ వ్యక్తిగత ఉపయోగానికై వాస్తవ ఖాతాలు నిర్వహించడం.
- **ఉత్పత్తిని తక్కువగా చూపించడం:** కేంద్ర ఎక్సైజ్, అమ్మకం, ఆదాయ పన్ను ఎగవేయడానికి ఉత్పత్తిని తక్కువగా చూపిస్తారు.
- **ఖర్చులను ఎక్కువగా చూపించడం:** తప్పుడు రసీదులు, సరుకుల పట్టీ ద్వారా అధిక ఖర్చులను చూపించడం.
- బోగస్ కంపెనీలు స్థాపించి వాటి పేరు మీద పెట్టుబడులు చూపించడం, హవాలా పద్ధతి ద్వారా అక్రమంగా ఇండియా నుంచి ఇతర దేశాలకు,అలాగే విదేశాల నుంచి ఇండియాకు అక్రమంగా డబ్బు రవాణా చేయడం.
- విదేశాలలో ఉన్న అనుబంధ వాణిజ్య సంస్థల ద్వారా అంతర్జాతీయ ఆర్థిక లావాదేవీలను తారుమారు చేయడం.
- పెట్టుబడి ఖాతాలలో అవకతవకలు
- భవన నిర్మాణం, నగల వ్యాపారం, స్వచ్ఛంధ సేవా సంస్థలకు విరాళం, పన్నుల మినహాయింపు కోసం లాభరహిత వ్యవస్థలలో పెట్టుబడులు.
- ఆకర్షణీయమైన పన్నుల రాయితీనిచ్చే దేశాలలో (లైకెన్‌స్టైయిన్, మారిషస్) పెట్టుబడి పెట్టి మళ్లీ అదే డబ్బును తిరిగి ఇండియాకు తెల్ల ధనం రూపంలో తరలించడం.

■ఇటీవల కాలంలో తీరాంతర ఆర్థిక కేంద్రాలు (off shore financial centres) ఆకర్షణీయమైన రాయితీలతో భారతదేశం నుంచి ఇతర దేశాలకు నల్లధనాన్ని తరలించడానికి ఊతమిస్తున్నాయి.

## నల్లధనం వెలికితీతకు కృషి చేసే సంస్థలు:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అనేక సంస్థలు ఇందులో భాగస్వామ్యం కలిగిఉన్నాయి.
ప్రత్యక్ష పన్నుల కేంద్రీయ బోర్డ్ (Central board of direct taxes)
కేంద్రీయ ఎక్సైజ్, కస్టమ్స్ బోర్డ్ (Central board of excise and customs)
ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED)
ఆర్థిక నిఘా విభాగం (Financial intelligence unit)
రాష్ట్రస్థాయిలో ఆర్థిక నేరాల విభాగం, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (CBI)
ప్రమాదకర నేరాల విచారణ కార్యాలయం (Serious fraud investigation office)
మత్తు పదార్థాల నియంత్రణ వ్యవస్థ (Narcotics control bureau)
కేంద్రీయ ఆర్థిక నిఘా వ్యవస్థ (Central economic intelligence bureau)
జాతీయ విచారణ సంస్థ (National investigation agency)
ఉన్నతస్థాయి కమిటీ (High level committe) మొదలైనవి.

## నల్లధన మహమ్మారిని ఎదుర్కొనేదెలా:

పన్ను ఎగవేత, నల్లధనం ఉత్పత్తి ఇటీవల తలెత్తిన సమస్య కాదు. 1936లో ఏయర్స్ కమిటీ ఈ సమస్యను లోతుగా విశ్లేషించి కొన్ని సూచనలిచ్చింది. పన్నుల విచారణ కమిషన్ (1953–54), కల్డర్ కమిటీ కొన్ని సిఫార్సులు చేశాయి. వీటి ఫలితంగా సంపద పన్ను చట్టం ఏర్పడింది. 1958లో ప్రత్యక్ష పన్నుల విచారణ కమిటీ సమీకృత పన్ను విధానాన్ని సిఫార్సు చేసింది. ఈ సంస్కరణల ఫలితంగా ఆదాయ పన్ను విధింపులో భాగంగా గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. 1971లో నియమితమైన వాంఛూ కమిటీ నల్లధన వెలికితీతకు కొన్ని సిఫార్సులు చేసింది. స్వచ్ఛందంగా ఆస్తి వివరాలు తెలిపి పన్ను చెల్లించే విధానాన్ని ప్రభుత్వం ప్రోత్సహించింది.

అంతర్జాతీయంగా, జి–7 శిఖరాగ్ర సమావేశంలో (1996) పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలు అనుసరించవలసిన వ్యూహాన్ని చర్చించారు. ఈ సమావేశంలో పన్నుల ఎగవేత స్వర్గంగా మారిన కొన్ని దేశాలను కట్టడి చేసేందుకు కొన్ని సూచనలు చేశారు. 2009 లండన్‌లో జరిగిన జి–20 సమావేశం ముందు స్విట్జర్లాండ్, లైకెన్‌స్టెయిన్, లక్జెంబర్గ్, మొనాకోలాంటి దేశాలు పన్నుల ఎగవేత నిరోధానికి సహకరిస్తాయని హామీనిచ్చాయి. భారత్‌తోసహా మిగిలిన జి–20 దేశాలు నల్లధన నిర్మూలనకు కృషి చేస్తామని ప్రకటించాయి.

ప్రపంచీకరణ నేపథ్యంలో పన్నుల ఎగవేత అంతర్జాతీయ సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో భారతదేశం బహుముఖ వ్యూహాన్ని రూపొందించింది.

■నల్లధనానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న కృషిలో భాగస్వాములు కావడం.

- అవసరమైన చట్టాలు రూపొందించడం.
- నల్లధనం వెలికితీతకు బలమైన యంత్రాంగాన్ని రూపొందించడం.
- అమలు చేసే యంత్రాంగాన్ని తయారుచేయడం.
- ఉద్యోగులకు ఈ ప్రక్రియకు సంబంధించిన శిక్షణ ఇవ్వడం.
- 2009లో పిట్స్‌బర్గ్‌లో జరిగిన జి-20 శిఖరాగ్ర సమావేశంలో ఈ ఉద్యమంలో సహకరించిన దేశాల/వ్యవస్థల విషయంలో అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందించారు. 2011లో ఐక్యరాజ్యసమితి రూపొందించిన అవినీతి వ్యతిరేక ఒప్పందాన్ని భారతదేశం ధ్రువీకరించింది.

## ప్రస్తుతం మనముందున్న కర్తవ్యమేంటి?

- బ్యాంకులనుసరిస్తున్న రహస్య విధానాలకు స్వస్తి చెప్పాలని ఒత్తిడి తేవడం.
- జర్మనీ, ఫ్రాన్సు దేశాలు పన్ను ఎగవేతదారుల వివరాలు సేకరించడానికి బ్యాంకు ఉద్యోగుల ద్వారా కీలక సమాచారాన్ని పొందాయి. భారతదేశానికి ఆ సమాచారాన్ని అందించాయి. అదేవిధంగా మనదేశం చొరవ తీసుకోవాలి.
- నల్లధనాన్ని గురించి సమాచారమిచ్చేవారికి తగిన రక్షణ కల్పించాలి.
- రాజకీయపార్టీలకిచ్చే విరాళాల్లో పారదర్శకత్వం పెంపొందించాలి.
- నేర నిరోధక వ్యవస్థల పనితీరులో రాజకీయ జోక్యం తొలగించాలి.
- సమాచార, సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ, నిఘా సంస్థల మధ్య సమాచార మార్పిడిని ప్రోత్సహించాలి.
- పన్ను చెల్లించని లాభరహిత సంస్థల కార్యకలాపాలను దిగ్బంధనం చేయాలి.
- మారిషస్‌లాంటి దేశాల ద్వారా వచ్చే విదేశీ పెట్టుబడుల మీద నిఘా పెంచాలి.
- సమీకృత వస్తువులు, సేవా పన్ను విధానం అమలు చేయాలి.
- ప్రపంచ దేశాలతో కలిసి మంచి పారదర్శక విధానాన్ని రూపొందించడానికి ఇండియా కృషి చేయాలి.

SAKSHI